క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

నాగర్‌కర్నూల్ క్రైం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ నాగర్‌కర్నూల్ స్టేషన్ పరిధిలో నాటు సారా రవాణా చేస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 24న ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఏడుకొండలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాట ఉదయం 11గంటలకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ద్విచక్ర వాహనంతో పాటు ఆటోను వేలం వేయనున్నామని, ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని తెలిపారు.

చైర్మన్‌ను నియమించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కార్పొరేషన్‌కు కొత్త చైర్మన్‌ను నియమించాలని కోరుతూ రాష్ట్ర బ్రాహ్మణ నాయకులు శ్రీపురానికి చెందిన జగన్‌మోహన్‌రావు ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రతి సంవత్సరం కార్పొరేషన్‌కు రూ.100 కోట్లు నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు తులసీశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై చర్యలు తీసుకోవాలి



కల్వకుర్తిరూరల్: జిల్లా కేంద్రంలో వైద్యం పేరుతో మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఆర్‌ఎంపీపై కఠిన చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఆర్‌ఎంపీ పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్‌బీ చారి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ఆర్‌ఎంపీ పీఎంపీలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సమావేశంలో డాక్టర్ స్వామి, విజయభాస్కర్‌రెడ్డి, శ్యాంబాబు, దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, వలీ, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేరు మార్పు తగదు

కల్వకుర్తిరూరల్: తెలుగు విశ్వవిద్యాలయం పేరును మార్చడం తగదని నాగర్‌కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేశ్‌లు పేర్కొన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములును తెలుగు విశ్వవిద్యాలయానికి పేరు తొలగించడం రెండు రాష్ట్రాలలోని భాషాభిమానులకు తీరని వేదన కలిగిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కోశాధికారి శివ, జగదీశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్‌జీఓ నాయకులు

కల్వకుర్తిరూరల్: తెలంగాణ నాన్ గెజిటెడ్ డివిజన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు సురేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు రాఘవేందర్‌రెడ్డి, మాజీ కార్యదర్శి లింగం, నాయకులు రమేష్, ప్రసాద్, మల్లేష్, ఫయాజ్‌తో పాటు పలువురు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని..

చారకొండ: మండలంలోని జేపల్లి పంచాయతీ పరిధిలోని నెమలిగుట్ట తండాకు చెందిన గ్రామస్తులు ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని, ఐదేళ్ల నుంచి మూతపడిన ప్రభుత్వ పాఠశాలను తెరిపించాలని, అర్ధాంతరంగా నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు అశోక్, యాదగిరి, మునిరాం, కిషన్, మున్న తదితరులు ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లిలో ఆదివారం బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. మొత్తం ఆరుగురికి చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు శివ, శేఖర్, కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.



వైకుంఠధామాలు జలమయం



పాపగల్ వైకుంఠధామంలో..



నాగదేవ్‌పల్లి శ్మశాన వాటికలో చేరిన వర్షం నీరు



వెల్దండలో నిండిన కొండకత్వ కుంట

తాడూరు: మండలంలోని పాపగల్, నాగదేవ్‌పల్లి గ్రామాల్లో దుందుభీనది ఒడ్డున నిర్మించిన శ్మశాన వాటికలు జలమయం అయ్యాయి. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వరద నీరు పోటెత్తడంతో వైకుంఠధామంలోకి వర్షం నీరు చేరింది.

కురిసిన భారీ వర్షం

తెలకపల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా కుండపోతగా వర్షం కురిసింది. పొలం పనులు చేసేందుకు ఆటంకం ఏర్పడింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు.

నిండిన చెరువులు, కుంటలు

వెల్దండ: మండలంలో రెండు రోజులుగా భారీగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నీటితో కళకళాడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో మండలంలోని రాచూర్, పెద్దాపూర్, కుప్పగండ్ల, బొల్లంపల్లి, వెల్దండ గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండాయి. ఈనెల 21న 10 సెంటి మీటర్లు, 22వ తేదీన 3 సెంటి మీటర్ల వర్షపాతం నమోదు అయ్యినట్లు అధికారులు తెలిపారు. చెరువులకు, కుంటలలోకి భారీగా వర్షం నీరు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బొల్లంపల్లి చెరువు, రాచూర్, పెద్దాపూర్ కుంటలు అలుగు పారుతున్నాయి.

అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం



మండలంలోని జప్తీ సదగోడు- మొల్గర గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. వాహనదారులు కొంచెం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రమాదాలబారిన పడాల్సిందే. కల్వర్టు నిర్మించకపోవడంతో ప్రతియేటా వర్షాకాలంలో వరదనీరు రోడ్డుపై నుంచి పారుతూ కోతకు గురవుతోందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు రోడ్ల నిర్వహణ ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కోతకు గురైన రోడ్డును బాగుచేయించాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– ఉప్పునుంతల

సంప్రదించాల్సిన అధికారి: – జలంధర్, ఆర్‌అండ్‌బీ డీఈఈ
ఫోన్ నంబర్: 9030615877

పూర్వ ఆత్మీయ సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న అంబట్‌పల్లి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2005–06 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలు తెలుసుకున్న 19 ఏళ్ల తర్వార కలుసుకోవడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆట పాటలతో ఆనందంగా గడిపారు. అప్పటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోతో ఆత్మవిశ్వాసం



నాగర్‌కర్నూల్‌రూరల్: తైక్వాండోతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా తైక్వాండో జనరల్ సెక్రెటరీ రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా గ్రౌండ్‌లో తైక్వాండో కలర్ బెల్ట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా 20 మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. అనంతరం బెల్ట్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, కోశాధికారి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి



మన్ననూర్: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించిన ఏపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణ రాజుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి మద్దెల దివాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌కు సంబంధించిన ఫ్లెక్సీని జన సంచారంలో బహిరంగంగా అవమాన పర్చడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యే తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పంబలి బుచ్చయ్య, దాసరి శ్రీనివాసులు, సెవ్వ బాలయ్య పాల్గొన్నారు.

వంటగ్యాస్ వాడకంపై అవగాహన



లింగాల: వంటగ్యాస్ వాడకంపై వినియోగదారులకు భారత్ గ్యాస్ ఏజెన్సీ డిస్ట్రిబ్యూటర్ బాలస్వామి అవగాహన కల్పించారు. ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటికి వెళ్లి వంట గ్యాస్ వాడకంపై మహిళలకు ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గ్యాస్ వాడకం అయిన వెంటనే రెగ్యులేటర్ ఆఫ్ చేయాలన్నారు. వంటింట్లో గ్యాస్ పొయ్యి సిలిండర్ కన్నా ఎత్తులో ఉండాలని, ఐఎస్ఐ మార్కు ఉన్న పరికరాలను మాత్రమే వాడాలని సూచించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వంట చేయడం ప్రమాదకరమన్నారు. వంటగదిలో కిరోసిన్, పూజకు సంబంధించిన నూనెలు, దుస్తులు ఉంచకూడదన్నారు. కార్యక్రమంలో ఏజెన్సీ సిబ్బంది అరుణ్‌కుమార్, బాలరాజు, భీముడు ఉన్నారు.

కార్మికుల శ్రేయస్సే ధ్యేయం



కల్వకుర్తిరూరల్: కార్మికుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తానని సూర్యలత స్పిన్నింగ్ మిల్లు మజ్దూర్ సంఘ్ అధ్యక్షుడు సూర్యప్రకాశ్‌రావు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్టోబర్ 1న కాటన్ మిల్లు గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. ఎల్లవేళలా కార్మికులకు అండగా ఉంటానన్నారు. సమావేశంలో కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

వేరుశనగ సాగుకు సన్నద్ధం



కల్వకుర్తిరూరల్: డివిజన్‌ పరిధిలో వేరుశనగను సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం వర్షాలు బాగా కురవడంతో పాటు కేఎల్ఐ కాలువల్లో నీరు సమృద్ధిగా పారుతుండడంతో వేరుశనగ సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. విత్తనాలు వేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. వేరుశనగను సాగు చేసేందుకు సిద్ధం కావడంతో పాటు విత్తనాలు కొనుగోలు చేసేందుకు మిల్లుల వద్దకు క్యూ కట్టడంతో పట్టణంలోని ఆయా మిల్లుల యజమానులు ఒక్కసారిగా విత్తనం రేటును భారీగా పెంచారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాధికారులు విత్తనాల బ్లాక్‌మార్కెట్‌ను అరికట్టాలని కోరుతున్నారు. ఈ విషయంపై వ్యాపారులను అడగగా విత్తనాలు ఎన్నో రకాలు ఉంటాయని దీనిని బట్టి ధర ఉంటుందని పేర్కొన్నారు.

మంజూరైన పనులను పూర్తి చేయించాలి



వీపనగండ్ల: గత ప్రభుత్వ హయాంలో పలు అభివృద్ధి పనులు మంజూరు చేయించామని, వాటిని వెంటనే పూర్తి చేయించాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మృతి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణం కోసం రూ.కోటి 75లక్షలు మంజూరు చేయించామని, పోలీస్ సర్కిల్ కార్యాలయం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. వాటిని తెప్పించడంలో కాంగ్రెస్ నాయకులు నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. కాల్వల ద్వారా సాగునీరు అందించేందుకు బొల్లారం, వల్లభాపురంలో మినీ రిజర్వాయర్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. వాటిని వెంటనే పూర్తి చేయిస్తే పలు గ్రామాల రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమలేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఎత్తం బాలస్వామి, సర్దార్, సాయిబాబు, నారాయణరెడ్డి, వేణుమాదవరెడ్డి, షమీ పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ సభ్యులు

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అక్టోబర్ 3 నుంచి నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బిల్లకంటి హరిబాబు పిలుపునిచ్చారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆర్యవైశ్య మహిళా సిండికేట్ సభ్యులు కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. అక్టోబర్ 3న మార్కెట్ శివాలయం నుంచి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా కన్యకా పరమేశ్వరి ఆలయానికి శోభాయాత్రగా తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. 3న అమ్మవారు బాలాత్రిపురా సుందరిగా, 4న మహాలక్ష్మి, 5న గాయత్రీ మాత, 6న అన్నపూర్ణదేవి, 7న లలితాదేవీ, 8న కాత్యాయని దేవీగా, 9న సరస్వతీదేవిగా, 10న దుర్గాదేవిగా, 11న మహిషాసుర మర్దినిగా, 12న రాజరాజేశ్వరీ మాతగా అమ్మవారిని అలంకరించనునట్లు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొట్ర బాలరాముడు, సూరంపల్లి రాధాకృష్ణ, డీవీ నారాయణ, అఖిల్, కిషోర్, నీలకంతం, సోమశెట్టి శేఖర్, కంచర్ల శ్యాం, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం చిన్నచూపు



విద్యార్థులతో సమస్యలు తెలుసుకుంటున్న డీఎస్పీ నాయకులు

ఉప్పునుంతల: సంక్షేమ హాస్టళ్లపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ మహారాజ్ విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో పరిస్థితులను పరిశీలించారు. స్థానిక వసతి గృహంలో కనీస వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. గదులకు తలుపులు, కిటీకీలు, హాస్టల్‌కు ప్రహరీ లేకపోవడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బీసీ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, రాజు పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల



కల్వకుర్తిరూరల్: పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో 'చలో సంక్షేమ భవన్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న విద్యార్థులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. 2017వ సంవత్సరంలో మెస్‌చార్జీలు పెంచారని ఇప్పటి వరకు పెంచలేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందడం లేదని వాపోయారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లలో 3,30,000 మంది విద్యార్థులు చదువుతున్నారని మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అశోక్, గణేష్, కుర్మయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హైడ్రాను జిల్లాలో అమలు చేయాలి



పెద్దకొత్తపల్లి: హైడ్రాను నాగర్‌కర్నూల్ జిల్లాలో వెంటనే అమలు చేయాలని బీఎంపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ విజయ్ గడ్డం విజయ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లాలో వివిధ గ్రామాల్లో ఉన్న చెరువు, కుంటలు, ప్రభుత్వ స్థలాలను కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు, వెంచర్లు వేసుకుని ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారన్నారు. చెరువు కుంటలను కాపాడేందుకు హైడ్రాను జిల్లాలకు విస్తరించాలని ఆయన అన్నారు. తెలంగాణ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కాశయ్య, ముక్తిమోర్చా జిల్లా కన్వీనర్ కల్మూరి శంకర్, నాగయ్య, మల్లేష్, గణేష్, నర్సింహా, రాజులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

కల్వకుర్తిరూరల్: ఈనెల 25న కల్వకుర్తి సగర సంఘం భవనంలో నియోజకవర్గ నాయకుల సమావేశం నిర్వహిస్తునట్లు ఆ సంఘం జిల్లా ఎన్నికల కమిటీ కన్వీనర్ ఆంజనేయులు, కో కన్వీనర్ రాజు సాగర్‌లు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఆయా గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద, భీమయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

గెల్వలాంబ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వంగూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన గెల్వలాంబమాత ఉత్సవాలు గత నెల 28న ముగిసాయి. ఆదివారం భక్తుల సమక్షంలో హుండీని లెక్కించగా రూ.1.61,600, టిక్కెట్ల ద్వారా రూ.1.36 లక్షలు, కొబ్బరికాయల ద్వారా రూ.56 వేలు ఆదాయం వచ్చినట్లు దేవస్థాన కమిటీ చైర్మన్ వెంకటస్వామి తెలిపారు. ఉత్సవాల విజయవంతానికి కృషి చేసిన భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

వీధి కుక్కలతో భయం.. భయం



మన్ననూర్‌లో సంచరిస్తున్న వీధి కుక్కలు

మన్ననూర్: వీధి వీధిలో ఎక్కడ చూసిన కుక్కల గుంపులు సంచరిస్తూ దాడులు చేస్తూ ప్రజలను హడలెత్తిస్తున్నాయి. అమ్రాబాద్ మండలం మన్ననూర్‌లో వీధి కుక్కలు అధికం కావడంతో వీధుల్లో ప్రజలు ముఖ్యంగా చిన్న పిల్లలు తిరగాలంటే భయాందోళనకు గురౌతున్నారు. ఇప్పటికే గ్రామంలో కోతుల బెడద అధికమై కూరగాయల మొక్కలు లేకుండా చేశాయి. ఇంటి తలుపులు తెరిచి ఉంటే ఇంటిలోకి దూరి తినుబండారాలు ఎత్తుకుపోవడం, ప్రయాణాలలో ఉన్నప్పుడు చేతిలో సంచులు లాగేయడం, తరుచుగా మహిళలు చిన్నపిల్లలపై దాడులు చేసి గాయపరిచిన సంఘటనలున్నాయి. వీటితో పాటు వీధి కుక్కల బాధలు భరించలేకపోతున్నారు. శ్రీశైలం–హైదరాబాద్, మన్ననూర్–మద్దిమడుగు ప్రధాన రహదారిలో కుక్కలు మోటారు బైకులను వెంబడిస్తున్నాయి. దీంతో ఆందోళనకు గురౌతున్న వాహనదారులు కింద పడి ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది స్పందించి వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు నిర్ణయం సరికాదు



నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని తీసుకున్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండిస్తున్నామని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సర్దుబాటు అంశాన్ని జిల్లా కలెక్టర్లకు, విద్యాశాఖ అనుమతి ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కితీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసే విధంగా నిర్ణయాలు తీసుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే 317 జీఓ ద్వార అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ బకాయిలు, మెడికల్ బిల్లును వెంటనే చెల్లించాలని, పీఆర్‌సీని ప్రకటించాలని కోరారు.